సాక్షి చిత్తూరు

మంగళవారం। 7। ఫిబ్రవరి। 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	18
తిరుపతి	31	18
తిరుమల	30	14
గూడూరు	34	20
నగరి	35	19



డ్రోన్‌తో పిచికారీ

పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో సోమవారం డ్రోన్లతో మందులను పిచికారీ చేసే విధానంపై కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. - పుత్తూరు రూరల్

న్యూస్‌రీల్

రేపటి నుంచి బోయకొండలో లక్ష కుంకుమార్చన



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 8 నుంచి 9,10 తేదీల్లో మూడురోజుల పాటు లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ సోమవారం తెలిపారు. ఆలయం వద్ద ఉభయదారులకు స్వాగతంతోపాటు పూజల్లో పాల్గొనడానికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదిపరాశక్తిగా పేరొందిన బోయకొండ అమ్మవారికి ప్రతిఏటా మాఘమాసంలో లక్ష నామ మంత్రంతో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉభయదారులుగా వ్యవహరించే భక్తులు రూ.1116 చెల్లించి తప్పనిసరిగా రశీదు పొందాలన్నారు. మిగిలిన వివరాలకు 79076 42845, 79016 42846ను సంప్రదించాలన్నారు.

9న జిల్లాకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఈ నెల 9న జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఆయన ఈ నెల 9వ తేదీన జిల్లాకి విచ్చేసి క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అనంతరం 10వ తేదీన కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించాలి


చిత్తూరు అర్బన్: స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 15 ఫిర్యాదులు రాగా, చీటింగ్ 2, భర్త వేధింపులు 4, ఆస్తి తగాదాలు 5, కుటుంబ తగాదాలు 4 చొప్పున అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ జి.నాగేశ్వర రావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఆర్‌ఐలు నీలకంటేశ్వర రెడ్డి, మధు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాశాలల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 7నుంచి 10 వ తేదీ వరకు జూనియర్ కళాశాలల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఉన్న 131 జూనియర్ కళాశాలల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హరి నారాయణన్ సోమవారం తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంబీయూ (మ్యాన్‌డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్) చేయనున్నారు. ఆధార్ కార్డు పొంది 5, 15 ఏళ్ల వయస్సు దాటి ఉన్నవారు, ఒక సారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారు దీన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు. దీనికి ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని, ఆధార్ కార్డు ఒరిజినల్/ జిరాక్స్ ఉంటే సరిపోతుందన్నారు. జిల్లాలో ఆయా సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్‌లు జూనియర్ కళాశాలల వద్దకు వెళ్లి ఆధార్ స్పెషల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు.

లావైపోతున్నారు!

ఊబకాయం.. ఇప్పుడు సాధారణమైపోయింది. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ సమస్య పీడిస్తోంది. దీని ప్రభావం శరీరంలోని మిగతా అవయవాల మీద పడుతోంది. ఫలితంగా గుండె, కిడ్నీ, మధుమేహం వంటి వ్యాధులకు మూలమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఊబకాయం నివారణకు జీవనశైలిని మార్చుకోవాల్సిన అవశ్యకత ఏర్పడింది. ప్రస్తుత ఆహారపు అలవాట్లు లావు కావడానికి ఒక కారణమైతే, సరైన వ్యాయామం లేకపోవడం మరో కారణమని జాతీయ ఆరోగ్య మిషన్ చేసిన సర్వేలో తేలింది. శ్రమగల జీవన విధానం, సమతులాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ సర్వే స్పష్టం చేసింది.



- పెరుగుతున్న అధిక బరువు కేసులు
- చుట్టుముడుతున్న గుండె, కిడ్నీ వ్యాధులు
- ముంచేస్తున్న ఆహారపు అలవాట్లు

చిత్తూరు రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో ఊబకాయం పెరిగిపోతోంది. దానికి తోడు వ్యాధులు చుట్టుముడుతున్నాయి. అధిక బరువు ఉన్న వారిని గుండె జబ్బులతో పాటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ, కీళ్ల సమస్యలు వెంటాడుతున్నాయి. ఊబకాయులు ఇటీవల అనేక దుష్ఫలితాలతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. కార్డియాలజీ రోగుల్లో 25 శాతం మంది ఊబకాయులే ఉంటున్నారు. కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, తగిన వ్యాయామం లేకపోవడం వల్ల ఈ ఊబకాయం బారిన పడుతున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిర్వహిస్తున్న నాన్ కమ్యూనికల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో సైతం ఒబెసిటీ కారణంగా రక్త పోటు, మధుమేహం, గుండె జబ్బులు సోకుతున్నట్లు తేలింది.

జిల్లాలో 17,54,254 మంది ఉండగా 12,99,758 మందిని ఎన్‌సీడీ సర్వే చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సర్వే 74.09శాతం పూర్తయింది. అయితే ఈ సర్వేలో బీపీతో బాధపడుతున్నవారు 1,96,772 మంది, మధుమేహంతో 1,96,957 మంది, రెండు ఉన్నవారు 17,675 మంది ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ వ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం ప్రజల ఆహార అలవాట్లు, జీవనశైలి, అధికబరువు వంటివి అని వైద్యులు చెబుతున్నారు.



బరువుతో గుండె బలహీనత

గుండె జబ్బుల బారిన పడుతున్న వారిలో ఊబకాయులే ఎక్కువగా ఉంటున్నారు. ఈ మధ్య కాలంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో కార్డియాలజీ ఓపీల సంఖ్య పెరుగుతోంది. రోజుకు జిల్లాలో 200 నుంచి 250 మంది వరకూ రోగులు వస్తున్నట్లు వైద్యులు లెక్కలు చెబుతున్నాయి. వారిలో 25 శాతం మంది అంటే 55 మంది ఊబకాయులే. వారిలో గుండె రక్తనాళాలు సన్నబడి బ్లాకులు ఏర్పడటం, గుండెపై తీవ్ర ఒత్తిడి, పల్మనరీ ఎంబోలిజమ్, పల్మనరీ హైపర్ టెన్షన్ వంటి సమస్యలను వైద్యులు గుర్తిస్తున్నారు. రక్తనాళాల్లో బ్లాకులు ఉన్న వారికి వాటిని తొలగించి స్టెంట్లు వేస్తున్నారు.

బరువు పెరగడానికి కారణాలు


పట్టణాల నుంచి పల్లెల వరకు జంక్‌ఫుడ్ వినియోగం పెరిగింది. పిజ్జాలు, బర్గర్లు, ప్యాకేజ్డ్‌ఫుడ్ ఐస్‌క్రీమ్‌లు, వేపుళ్లు తెచ్చుకుని తినడం ఫ్యాషన్‌గా మారింది. మనసు కోరుకుంటే చాలు వెంటనే చేతిలోని మొబైల్‌లోని కొన్ని యాప్‌లద్వారా జంక్‌ఫుడ్‌ను ఆర్డర్ పెడితే క్షణాల్లో గుమ్మం ముందు డెలివరీ చేస్తున్నారు. దీనికి తోడు రెస్టారెంట్లలో విక్రయించే ఆహారాల్లో బిర్యానిదే మొదటిస్థానం. ఇందులో అధిక శాతం క్యాలరీలు ఉండడం, వీటికి తోడు కూల్‌డ్రింక్‌లు తాగడం వల్ల తక్కువ సమయంలోనే మగవారితోపాటు అధికంగా మహిళలకు ఊబకాయం వచ్చేస్తోంది.

కిడ్నీ సమస్యలు

ఒబెసిటీ కారణంగా కిడ్నీలపై ఒత్తిడి పడుతోంది. ఆ కారణంగా ఫిల్టర్లు దెబ్బతింటున్నాయి. దీంతో యూరిన్లో ప్రొటీన్లు లీకవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. కాళ్ల వాపులు రావడం, కిడ్నీలు పూర్తిగా పాడైన వారిని చూస్తున్నారు. ఊబకాయుల్లో వచ్చే మధుమేహం, రక్తపోటు కారణంగా కిడ్నీలు దెబ్బతిన్న వారు డయాలసిస్ కోసం వస్తున్నారు. జిల్లా కేంద్రంలో నిత్యం 50 నుంచి 65 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు.

ఇతర వ్యాధులు

- ఒబెసిటీ వారిలో రక్తపోటు, మధుమేహం వలన వచ్చే దుష్ఫలితాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.
- ఒబెసిటీ ఉన్న వారిలో పదిశాతం మందికి గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడుతున్నాయి.
- ఫ్యాటీ లివర్ ఏర్పడి, దీర్ఘకాలంలో తీవ్రమైన లివర్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- మోకీళ్లపై ప్రభావం చూపి, నాలుగు పదుల వయసులోనే మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తోంది.



ఇలా చేస్తే మేలు

- దేశంలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 23.5 దాటిన వారందరినీ ఊబకాయులుగా భావిస్తారు.
- వారు బరువు తగ్గేందుకు శ్రమగల జీవన విధానం, సమతుల ఆహారం తీసుకుంటే సత్ఫలితాలు రాబట్టవచ్చు.
- బరువు తగ్గేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక విధానాలు ఉన్నాయి. దీర్ఘకాల విధానంలో వారానికి మూడు, నాలుగు గంటలు వ్యాయామం ద్వారా బరువు చేయడం తగ్గించుకోవచ్చు.
- స్వల్పకాలంలో రోజుకు వెయ్యి కేలరీల కంటే తక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చు. బీఎంఐ27 శాతం కంటే ఎక్కువ ఉన్న వారికి మందులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పద్ధతులను అనుసరించినా బరువు తగ్గకుంటే బీఎంఐ 30 శాతం దాటిన వారికి బేరియాట్రిక్ (మెటబాలిక్) సర్జరీలతో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

బరువు తగ్గితే మంచిది



ఊబకాయం ఉన్న మధుమేహులు తమ బరువులో ఐదు శాతం తగ్గించుకోగా తక్కువ మందులతో మెరుగైన వ్యాధి నియంత్రణా ఫలితాలు రాబట్టవచ్చు. హృద్రోగ సమస్యలను నివారించుకోవచ్చు. సమతుల ఆహారం, క్రమగల జీవన విధానం, జీవనశైలిలో మార్పులు పాటించడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. ఊబకాయుల్లో మధుమేహ నియంత్రణకు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ అరుణ్‌కుమార్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

పేర్నాటిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం



సమావేశంలో పాల్గొన్న పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిలుపు

చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఒక కల్యాణ మండపంలో సోమవారం కళాశాల విద్యార్థులు, పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు విజయానందరెడ్డి మాట్లాడారు. పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్నాటి ట్రస్ట్ పేరుతో విరివిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. మార్చిలో ఎన్నికల తేదీని ప్రకటిస్తారని పట్టభద్రులు తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీకి వేయాలన్నారు. 2019 నుంచి జరుగుతున్న అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటర్లు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తుచేశారు. గూడూరు నియోజకవర్గంలో రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు ఓట్లు వేసి ఎమ్మెల్సీగా సేవ చేసే అవకాశం కల్పించాలని పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థించారు. ఈ ఏడాది రాష్ట్ర చరిత్రలోనే అధికంగా 3.9 లక్షల పట్టభద్రుల ఓట్లు నమోదు కావడం ఆశ్చర్యకరమన్నారు. చిత్తూరులోనే 8వేలకు పైగా ఓటర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తున్నామని చెప్పారు. కొందరు పనిగట్టుకొని ప్రభుత్వంపై ఉద్యోగులకు వ్యతిరేకత ఉందంటూ ప్రచారం చేస్తున్నరన్నారు. పేర్నాటి మృదుస్వభావి నలుగురికి సాయం చేసే వ్యక్తి అని మేయర్ అముద తెలిపారు. పట్టభద్రులు ఆయనకు ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, సునీత, స్వరూపరాణి, మధురెడ్డి, రమణ, పూర్ణ, సయ్యద్ కోఆప్షన్ సభ్యులు అను, చందు నాయకులు మధురాయల్, కేపీశ్రీధర్, శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను పట్టించుకోని బాబు

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



విలేకర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: చంద్రబాబు దళితుల శ్మశానవాటికలను ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం చినబాపనపల్లి దళితవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు పెత్తందార్లకు మాత్రమే సీఎంగా వ్యవహరించారని, పేదలకు కాదని గుర్తుచేశారు. ఆయన తన 14 ఏళ్ల పాలనలో ఎన్నడూ దళితులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల ఆర్థిక అభివృద్ధితోపాటు శ్మశానవాటికలను ఆధునీకరించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారని గుర్తు చేశారు. కనీసం ఎస్సీ, ఎస్టీలను పట్టించుకోని బాబు ఎన్నికల నాటికి వారి ఓట్ల కోసం తహతహలాడుతున్నాడని ఎద్దేవా చేశారు. జన్మభూమి కమిటీల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందని ద్రాక్షగా చేసిన ఘనత బాబుదేనని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, లోకేష్ పాదయాత్ర ఒక మ్యాజిక్ షో మాత్రమేనని దుయ్యబట్టారు.

గజరాజులకు విద్యుత్ గండం



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి

- డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలతో ఏనుగులు మృతి చెందుతున్నాయని, గజరాజులకు విద్యుత్ ముప్పు పొంచి ఉందని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. డీఎఫ్‌ఓ కార్యాలయంలో సోమవారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఈఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవిలో నుంచి పల్లెల్లోకి వస్తున్న ఏనుగులు తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొనడం, విద్యుత్ తీగలను తొక్కడం తదితర కారణాలతో విద్యుత్ షాక్‌కు గురై మరణిస్తున్నాయని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె వేయడం లేదని గుర్తుచేశారు. రెస్కో పరిధిలో రాత్రి వేళ వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం లేదని ఆ పద్ధతిని ట్రాన్స్‌కో అధికారులు పాటిస్తే బాగుంటుందన్నారు. ఏనుగులు పల్లెలోకి వచ్చిన సమయంలో విద్యుత్ సరఫరా ఆపాలని ట్రాన్స్‌కో ఏఈలకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఏనుగులకు తెలుపు రంగు నచ్చదని, ఆ రంగులో ఉండే విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్లకు ఆకుపచ్చ రంగు వేయాలని సూచించారు. ఆ రంగులను అటవీశాఖ సరఫరా చేస్తుందని తెలిపారు. ఎక్కువగా ఏనుగులు రాత్రి నుంచి ఉదయం వరకు అడవిలో నుంచి బయటకు వస్తుంటాయని, ఆ సమయంలో అవి సంచరించే ప్రాంతాలను (హాట్‌స్పాట్స్) గుర్తించాలని సూచించారు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ వేసి ఎత్తు పెంచాలని కోరారు. తరచూ రేంజ్ పరిధిలో ఎఫ్‌ఆర్వో, ఈఈ, మండల పరిధిలో ఎఫ్‌ఎస్వో ఏఈలు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వోలు బాలకృష్ణారెడ్డి, థామస్, నయీం, మదన్‌మోహన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించండి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం పనులను నాణ్యతతో పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో పనులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనుల పురోగతిపై పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 612 సచివాలయాలు ఉండగా, 349 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. 336 సచివాలయాల పరిధిలో 2,173 పనులకు ప్రతిపాదనలు అప్‌లోడ్ చేశారన్నారు. 2,073 పనులకు పరిపాలన అనుమతులు రూ.6393.26 లక్షలతో మంజూరు చేసినట్లు వివరించారు. ఇందులో 268 పనులు పూర్తి కాగా, 1,089 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన పనులను వెంటనే ప్రారంభించి, పూర్తయిన పనుల బిల్లులను వెంటనే సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు చంద్ర శేఖర్ రెడ్డి, నాగజ్యోతి, సీపీఓ ఉమాదేవి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ శ్రీహరి పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

స్పందన అర్జీలకు ప్రాధాన్యత

స్పందన అర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రాధాన్యతగా భావించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్ వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఆర్‌డీఏ పీడీ తులసి తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇందులో రెవెన్యూ శాఖకు శాఖ సంబంధించి 133, డీఆర్‌డీఏ 40, హౌసింగ్ శాఖ 5, వైద్య ఆరోగ్య శాఖ 2, నగర పాలక సంస్థ 1, డ్వామా 2, ఉపాధి కల్పన 1, వికలాంగుల శాఖ 1, పంచాయతీరాజ్ శాఖ 1, స్త్రీ శిశు సంక్షేమ శాఖ 1, జిల్లా సైనిక్ వెల్ఫేర్ శాఖ 1, ఇతరులు 3 అర్జీలు వచ్చాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

ఎస్పీఎల్ విజేత సీకాం

- అట్టహాసంగా ముగిసిన జిల్లా స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్
- క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికే ఎస్పీఎల్
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి వెల్లడి


ఎస్పీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో గత వారం రోజులుగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీనియర్స్ విభాగంలో 31, జూనియర్స్ విభాగంలో 7, మొత్తం 38 జట్లు పాల్గొన్నాయి. లీగ్, నాకౌట్ పద్ధతిలో ఐసీసీ నియమనిబంధనలకు అనుగుణంగా ఐపీఎల్ తరహాలో ఎస్పీఎల్‌ను నిర్వహించారు. లీగ్, నాకౌట్‌లో ప్రతిభ కనబరచి ఫైనల్స్‌కు చేరుకున్న సీనియర్స్, జూనియర్స్ జట్లుకు సోమవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతిలోని సీకాం విద్యాసంస్థల జట్లు సీనియర్స్, జూనియర్స్ విభాగాలు రెండింటిలో సత్తాచాటి జిల్లా స్థాయిలో విజేతగా నిలిచాయి. ఈ జట్లు త్వరలో జోనల్ స్థాయిలో నిర్వహించనున్న సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొననున్నాయి.

సీనియర్స్ రెండో సెమీ ఫైనల్

సీనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం డిగ్రీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య నిర్వహించిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సీకాం జట్టు 15 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 99పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌జీఎస్ జట్టు 10ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది.

జూనియర్స్ ఫైనల్ విజేత సీకాం జూనియర్ కళాశాల

జూనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం జూనియర్ కళాశాల, ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో సీకాం జట్టు 29 పరుగుల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 10 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది.

సీనియర్స్ ఫైనల్ విజేత సీకాం డిగ్రీ కళాశాల

సీనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల, శ్రీవిద్యానికేతన్ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో సీకాం జట్టు 40 పరుగుల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన విద్యానికేతన్ జట్టు 10 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 49 పరుగులు మాత్రమే చేసింది.

ఓటమే గెలుపునకు నాంది : కలెక్టర్ వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఓటమే గెలుపునకు నాంది అని, గెలుపోటములను సమానంగా స్వీకరించిన వారే నిజమైన క్రీడాకారులని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎస్పీఎల్ ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. తిరుపతిలో స్టేడియం నిర్మాణానికి అనువైన స్థల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. క్రికెట్ వంటి క్రీడల్లో జట్టు సభ్యుల సమష్టి కృషితోనే విజయం సాధించగలరని తెలిపారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి ఎస్పీఎల్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహసీల్దార్ ఎం.లోకేశ్వరి, అంపైర్లు డి.రమేష్, జి.కిరణ్‌కుమార్, స్కోరర్ జ్యోతి, సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు, బ్యూరో ఇన్‌చార్జ్ టి.రవిరెడ్డి, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన సీకాం జూనియర్ కళాశాల జట్టు


జూనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు


సీనియర్స్ విభాగంలో గెలుపొందిన సీకాం డిగ్రీ కళాశాల జట్టు


సీనియర్స్ విభాగంలో రన్నర్స్ స్థానంలో నిలిచిన శ్రీవిద్యానికేతన్ జట్టు

క్లుప్తంగా

17 నుంచి మేయర్ హత్య కేసు విచారణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణను (ట్రయల్) ఈ నెల 17 నుంచి జరపనున్నట్లు స్థానిక 6వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం జడ్జి శాంతి పేర్కొన్నారు. 2015లో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన జంట హత్యల కేసులో కటారి మోహన్ మేనల్లుడు చింటూతో పాటు 21 మంది నిందితులుగా ఉన్నారు. ఈ కేసు ట్రయల్ షెడ్యూల్‌ను 17 నుంచి నిరంతరాయంగా విచారించనున్నట్లు న్యాయమూర్తి షెడ్యూల్ ప్రకటించారు. కేసులోని సాక్షులందరినీ తేదీల వారీగా విచారించి, వారి వాంగ్మూలం నమోదుచేసిన అనంతరం న్యాయస్థానం తీర్పు వెలువరించనుంది.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా



గంగవరం: కంకరపొడి లోడ్డుతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పలమనేరు నుంచి మదనపల్లెకు కంకర పొడి లోడ్డుతో వెళ్తున్న టిప్పర్ మబ్బువారిపేట క్రాస్‌లో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి సమాచారం అందలేదు.

ఓవరాల్ చాంప్‌గా పలమనేరు పాలిటెక్నిక్


ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

పలమనేరు: రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్‌లో పలమనేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 1నుంచి 3వరకు విజయవాడలో నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పలు ఈవెంట్లలో మంచి ప్రతిభను కనబరిచిన పలమనేరు క్రీడాకారులు అగ్రస్థానంలో నిలిచారు. వాలీబాల్ పోటీల్లో పలమనేరు జట్టు రన్నర్స్‌గా, 200మీటర్లు, 300మీ, వందమీటర్ల విభాగంలో సురేఖ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచింది. లాంగ్‌జంప్‌లో సురేఖ మొదటి స్థానంలోనూ, ట్రిపుల్ జంపులో పల్లవి తొలిస్థానం, సురేఖ, పల్లవి తృతీయ, నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో ఈ కళాశాలకు ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కింది. త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు వాలీబాల్ క్రీడాకారులు భారతి, సురేఖ, సంధ్య, అథ్లెటిక్స్‌లో సురేఖ, పల్లవి ఎంపికయ్యారు. కళాశాలకు మంచిపేరు తీసుకొచ్చిన విద్యార్థులను స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ మహమూద్ సోమవారం అభినందించారు.

వేపగుంటలో చోరీ

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని వేపగుంట గ్రామానికి చెందిన ఎస్.అంబూరు రాజేశ్వరి ఇంట్లో చోరీ జరిగినట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. రాజేశ్వరి కుమార్తె ఫిర్యాదు మేరకు ఆదివారం రాజేశ్వరి వేపగుంటలోని ఇంటికి తాళం వేసి పుత్తూరులో నివాసం ఉంటున్న కూతురు (మునెమ్మ) ఇంటికి వచ్చింది. తిరిగి ఇంటికెళ్లి చూడగా తలుపు తాళం పగులగొట్టి, ఇంటిలోని బీరువాను తెరచి అందులోని రెండు సవర్ల బంగారు గాజులు, ఐదు సవర్లగొలుసు, రూ.90వేల నగదు, రూ.16వేలు విలువ చేసే టీవీని దొంగిలించుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్య సాధనలో పలమనేరు ఏఎంసీ టాప్

- సూపర్‌వైజర్లకు ప్రతివారం దిశానిర్దేశం
- ఫలించిన చైర్మన్, సెక్రటరీల వ్యూహం



జిల్లాలో ఏఎంసీల పన్నుల వసూళ్లు

ఏఎంసీ పేరు	ఫిబ్రవరి లక్ష్యం	వసూళ్లు
పలమనేరు	2.13కోట్లు	2.30 కోట్లు
చిత్తూరు	1.71కోట్లు	1.73కోట్లు
పుంగనూరు	84.82లక్షలు	85.95లక్షలు
బంగారుపాళెం	68.36లక్షలు	68.82లక్షలు
నగరి	54.68లక్షలు	54.72లక్షలు
కుప్పం	50.24లక్షలు	50.86లక్షలు
పెనుమూరు	48.33లక్షలు	48.34లక్షలు
రొంపిచెర్ల	10.39లక్షలు	10.55లక్షలు
ఎస్ఆర్ పురం	12.10లక్షలు	12.18లక్షలు
సోమల	6.13లక్షలు	6.24లక్షలు

పలమనేరు: పన్నుల వసూళ్లలో రాయలసీమలోనే పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏఎంసీకి మార్కెటింగ్‌శాఖ పన్ను వసూళ్ల లక్ష్యం 2023కి సంబంధించి(ఫిబ్రవరిదాకా) రూ.2.13 కోట్లు కాగా ఇప్పటికే రూ.2.30 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకు స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యదర్శి ప్రత్యేకంగా చేసిన కృషితోనే ఇది సాధ్యమైంది. ముఖ్యంగా పరిశ్రమల ద్వారా రావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయడం ద్వారా వీరు లక్ష్యాలను సాధించారు.

సీమలో పలమనేరు అగ్రస్థానం

రాయలసీమలో మొత్తం 84 వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా చిత్తూరు జిల్లాలో పది ఏఎంసీలున్నాయి. ఈ సారి ఊహించని రీతిలో పలమనేరు మార్కెటీ కమిటీ రాయలసీమలోనే పన్ను వసూళ్లలో నెంబర్–1గా నిలిచింది. రాయలసీమలో గత పదేళ్లుగా ఆదోని, కడప, ఎమ్మిగనూరు, తాడిపత్రి, ములకలచెరువు, తిరుచానూరు, శ్రీకాళహస్తిలాంటి మున్సిపాలిటీలే అగ్రస్థానంలో ఉండేవి. వేరే ఏఎంసీలకు అప్పులు సైతం ఇచ్చే స్థాయిలో వీటి ఆదాయాలు ఉండేవి. జిల్లాల విభజన జరిగాక చిత్తూరు జిల్లాలో పది మార్కెట్ కమిటీలున్నాయి. వీటిలో ఈ 2023కు సంబంధించి పన్ను వసూళ్లలో పలమనేరు నెంబర్–1గా నిలిచింది.

జిల్లాలోని అన్ని ఏఎంసీలు ఇప్పటిదాకా లక్ష్యాలను సాధించినప్పటికీ పలమనేరు మాత్రం లక్ష్యానికి మించిన వసూళ్లు సాధించడంతోనే అగ్రగామిగా నిలిచింది. జిల్లాలో మొత్తం పన్ను వసూళ్లు రూ.7.30 కోట్లు కాగా అందులో పలమనేరులోనే 2.3 కోట్లు వసూలు కావడం గమనార్హం.

సరిహద్దులో ఉన్నందునే..

జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో రైతులు పండించిన 240 రకాల వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలపై సంబంధించిన మేర పన్ను వసూలు చేయాల్సి ఉంది. వీటిల్లోనూ ప్రభుత్వం గతంలో కొన్ని ఉత్పత్తులపై మినహాయింపులు చేసింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిల్లోనూ పలమనేరు అగ్రగామిగా నిలిచేందుకు ఈ ప్రాంతం అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడమే కారణమైంది.

పన్నుల ఎగవేతపై ఇలా చర్యలు

గతంలో మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్‌లో పనిచేసే సిబ్బంది కొన్ని వాహనాల నుంచి సెస్ వసూలు చేయకపోవడం, చేతివాటాల కారణంగా పన్నులు తగ్గేవి. కానీ ప్రస్తుత పాలకవర్గం దీనిపై నిఘా పెట్టింది. ఎప్పటికప్పుడు తనిఖీ కేంద్రాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న తప్పులను కనిపెట్టి చర్యలు తీసుకుంది. దీంతో పాటు నియోజకవర్గంలోని ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీలనుంచి మార్కెట్ కమిటీకి రావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేసింది. సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వసూళ్లను పటిష్టం చేసింది. దీంతో కర్ణాటక సమీపంలోని ఆళకుప్పం చెక్‌పోస్టులోనే రూ.కోటి దాకా పన్నులను వసూలు చేయడం కొసమెరుపు.

గతంలో చేసిన నిర్లక్ష్యాన్ని గుర్తించాం



గతంలో కొన్ని పరిశ్రమలనుంచి పన్నులు వసూలయ్యేవికాదు. కార్యాలయంలోని సిబ్బందిని అప్రమత్తం చేసి వారికి టార్గెట్‌లు పెట్టాం. దీంతో వారు పన్నులను సకాలంలో వసూలు చేసి సత్ఫలితాలు సాధించారు. సెక్రటరీ ప్రతివారం సమీక్షలు పెట్టి పన్నుల వసూళ్లకు కంకణం కట్టుకున్నారు. దీంతో అనుకున్నదానికంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయి.

– హేమంత్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్, పలమనేరు

పలమనేరు ఏఎంసీ మేటి



జిల్లాలోని అన్ని ఏఎంసీలకంటే ఈ సారి పలమనేరు మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో ముందుంది. దీనికి కారణం అక్కడి అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. సూపర్‌వైజర్లు ఆయా ప్రాంతాల్లోని ఆహార పరిశ్రమలు, పాలడైరీలు, దాణా పరిశ్రమల పన్నుల వసూలుకు చొరవ చూపారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాల సరిహద్దులనుంచి వచ్చే వాహనాలపై సెస్‌ను పటిష్టంగా వసూలు చేశారు. దీంతో వారు మేటిగా నిలిచారు.

– పరమేశ్వరన్, డిస్ట్రిక్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్

గంజాయి స్వాధీనం: నలుగురి అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ తమకు అందిన పక్కా సమాచారంతో పిళ్లారిపట్టు రోడ్డులోని కోమిటోళ్ల బావి వద్ద ముగ్గురు వ్యక్తులతోపాటు ఓ మహిళను సోమవారం ఉదయం 11 గంటలకు అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.10 వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో స్థానిక గేట్‌పుత్తూరుకు చెందిన కె.అంబిక(29), జి.సాయికుమార్(23), కె.లక్ష్మీకాంత్(28), సి.చరణ్(29) ఉన్నారని వివరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ముఖ హాజరు రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : అంగన్‌వాడీ ఉద్యోగులకు ముఖహాజరు రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. లలిత మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు చైతన్య, సురేంద్రన్, వాడగంగరాజు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలి...

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అప్పగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.